సాక్షి
తిరుపతి
గురువారం । 11 । జూలై । 2024



రైల్వే లైన్లకు భూసేకరణ వేగవంతం

భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆర్డీఓలను ఆదేశించారు. - 8లో



ఆరంభం.. సాక్షాత్కార వైభవం

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు ప్రారంభమయ్యాయి. - 8లో



సమర్థవంతంగా గస్తీ

రాత్రిపూట సమర్థవంతంగా గస్తీ నిర్వహించాలని. గట్టి నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

పార్టీ అధినేత దృష్టికి కూటమి దాడుల ఉదంతాలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విజయవాడలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి జిల్లాకు సంబంధించిన తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న దాడుల గురించి చర్చించినట్లు తెలియజేశారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: భారత ప్రభుత్వం 2025 జనవరి 26 గణతంత్ర దినోత్సవం రోజున ప్రకటించే పద్మ అవార్డులకు సంబంధించి వివిధ రంగాలలో ప్రతిభ కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సెట్విన్ సీఈఓ డాక్టర్ వి.మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యరంగం, సామాజిక సేవ, సైన్స్, ఇంజినీరింగ్, ప్రజా వ్యవహారాలు, పౌర సేవలు వృత్తి, పరిశ్రమ, వంటి రంగాలలో అత్యున్నతమైన ప్రతిభ గల వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ https://awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇందు కోసం www.padmaawards.gov.in వెబ్‌సైట్‌లో మొదటగా అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. లేదా సెట్విన్ కార్యాలయం, అలిపిరి రోడ్డు, తిరుపతి చిరునామాలో సంబంధిత దరఖాస్తు నమూనాను పొంది పూర్తి వివరాలతో కార్యాలయం పని రోజులలో ఈనెల 22వ తేదీలోపు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు ఆ వెబ్‌సైట్ చూడవచ్చని, ఇతర వివరాలకు 0877-2286921, 94405 73537లను సంప్రదించాలని తెలియజేశారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,245 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,054 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.51 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

13 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : టెన్నిస్ బాల్ క్రికెట్ అండర్-14, 17, 19 బాలబాలికలు, సీనియర్స్ జిల్లా జట్లను ఈ నెల 13, 14వ తేదీల్లో పోటీలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.ఉదయ్, బి.మనోహర్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ 13న తిరుపతి సమీపంలోని అకార్డ్ స్కూల్ ఆవరణలో అండర్-14, 17 బాలబాలికలకు, 14న సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అండర్-19 బాలబాలికలకు, సీనియర్స్ విభాగంలో మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అండర్-14కు ఎంపికైన వారు తమిళనాడులో నిర్వహించే జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో, అండర్-17కు ఎంపికైన వారు మన రాష్ట్రంలో నిర్వహించే పోటీల్లో, అండర్-19కు ఎంపికైన వారు నంద్యాల జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో, సీనియర్స్ విభాగంలో ఎంపికైన వారు ఈ నెల 27, 28వ తేదీల్లో పాండిచ్చేరిలో జరగనున్న సౌత్ జోన్ టోర్నీలో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు 94902 52821 నంబరులో సంప్రదించి, పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

జిల్లాలో 2014-2019లో ఇసుకాసుర సామ్రాజ్యాన్ని స్థాపించిన టీడీపీ నేతలు మళ్లీ అదేబాటలో పయనిస్తున్నారు. అప్పట్లో శ్మశానాలు, సమాధులు ఉన్నా కూడా పట్టించుకోకుండా జేబులు నింపుకోవడమే పరమావధిగా స్వర్ణముఖి నదిని ఎక్కడబడితే అక్కడ తవ్వేసి కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన నేతలు..ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలోనూ అదే పంథా ఎంచుకున్నట్టు ప్రస్తుత పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల ఫలితాలను తమకు అవకాశంగా తీసుకుని ఇసుక రీచ్‌లలో ఇసుకను కొల్లగొట్టి కోట్లాది రూపాయలు జేబులు నింపుకున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇసుక అక్రమాలకు తావివ్వకుండా విధివిధానాలు అమలు చేస్తే..ప్రస్తుత ప్రభుత్వం దీనికి పాతర వేసింది. అధికారంలోకి వస్తే ఇసుక ఫ్రీ అని ఆర్భాటంగా ప్రకటించిన చంద్రబాబునాయుడు ఇసుక పాలసీతో తమ పార్టీ నేతలకు జేబులు నింపేలా చేశారనే విమర్శలు వస్తున్నాయి.



పిచ్చాటూరు పాయింట్ వద్ద టిప్పర్‌కు లోడింగ్ చేస్తున్న ఇసుక

ఇసుకాసురులు

- గుట్టుగా 26వేల టన్నులు అమ్మేశారు!
- టన్ను రూ. 8వేల నుంచి రూ.10వేలకు..
- టీడీపీ నేతలకు జేబుల్లోకి రూ.25 కోట్లు
- ఎన్నికల ఫలితాల తర్వాత ఇసుక స్వాహాపర్వం
- టీడీపీ టిప్పర్లకే తొలి ప్రాధాన్యత
- ఇసుకకు కూడా సిఫార్సులు
- సామాన్యులకు తప్పని కష్టాలు
- ట్రాక్టర్ ఇసుకకు 12 గంటల పడిగాపులు
- శ్రీకాళహస్తి, గూడూరు ఇసుక మాటేమిటో..?



దొరవారిసత్రం వద్ద ఇసుక కోసం నిరీక్షిస్తున్న వినియోగదారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: టీడీపీ ఇసుకాసురుల ధన దాహానికి అప్పట్లో ఏర్పేడు మండలంలోని మునగలపాళెంలో 16 మంది ప్రాణాలు కోల్పోవడంతోపాటు 24 మంది తీవ్రంగా గాయపడడం ఇప్పటికీ జనం ముందు కదలాడుతూనే ఉంది. వాస్తవానికి 2019-2023 వరకు ఇసుక అక్రమాలకు తావులేకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పార్టీ నేతలు ఇసుకపై కన్నేశారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం జిల్లాలోని ఇసుక రీచ్‌ల వద్ద నిల్వల్లో 26వేల టన్నుల పైచిలుకు ఇసుకను పది రోజుల్లో గుట్టుచప్పుడు కాకుండా విక్రయించి రూ.25 కోట్లు దండుకున్నట్లు ప్రచారంలోకి వచ్చింది. ఎమ్మెల్యే స్థాయి నేతలు తమ అనుచరులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో టీడీపీ నేతలు మిగులు ఇసుకను టన్ను రూ.8వేల నుంచి రూ.10వేలకు అమ్మి కోట్లు దండుకున్నారు. గత ప్రభుత్వం నిబంధనల మేరకు విక్రయించగా మిగిలిన ఇసుకను స్టాక్ పాయింట్‌లో ఉంచింది. అప్పటి ప్రభుత్వంలో వెంకటగిరి పరిధిలో మొగళ్లగుంట, సూళ్లూరుపేట పరిధిలో మావిళ్లపాడు, సత్యవేడు పరిధిలో అడవికొడియంబేడు, సుబ్బానాయుడుకండ్రిగ, గూడూరు పరిధిలో కోట-వాకాడు స్వర్ణముఖి బ్రిడ్జి వద్ద, శ్రీకాళహస్తి పరిధిలో పెనుమల్లం, తిరుపతి, చంద్రగిరి పరిధిలో రేణిగుంట గాజులమండ్యం పోలీస్ సమీపంలో స్టాక్ పాయింట్లు ఉండేవి.

జిల్లాలో నాలుగు స్టాక్ పాయింట్లు

ప్రాంతం	ఇసుక పాయింట్	టన్ను ధర (రూ.)
వెంకటగిరి	మొగళ్లగుంట	590
సూళ్లూరుపేట	మావిళ్లపాడు	465
పిచ్చాటూరు	ఏకే బేడు	200
నాగలాపురం	సుబ్బానాయుడు కండ్రిగ	200

గత ప్రభుత్వంలో స్టాక్ ఇదే!

గత ప్రభుత్వంలో(ఎన్నికల షెడ్యూల్ నాటికి)ఇసుక స్టాక్ పాయింట్లలో అయితే సూళ్లూరుపేట పరిధిలోని మావిళ్లపాడు 21,500, వెంకటగిరి పరిధిలోని మొగళ్లగుంట 1400, సత్యవేడు పరిధిలోని సుబ్బానాయుడు కండ్రిగలో 26,500, అడవికొడియంబేడులో 1,42,000 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్లు మాత్రమే అధికారులు చూపించారు. అయితే అంతకు మించి ఇసుక నిల్వలు ఉన్నట్లు జోరుగా చర్చ సాగుతోంది. వాస్తవానికి ఆ మిగులు ఇసుకను టీడీపీ నేతలు ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగా రావడంతో విక్రయించినట్లు సమాచారం.

26వేల టన్నుల ఇసుక మాయం!

శ్రీకాళహస్తి పరిధిలోని పెనుమల్లం ఇసుక పాయింట్, తిరుపతి, రేణిగుంటకు చెందిన గాజులమండ్యం, గూడూరుకు చెందిన కోట-వాకాడు స్వర్ణముఖి బ్రిడ్జి స్టాక్ పాయింట్ల వద్ద 20వేల మెట్రిక్ టన్నులకు పైగా స్టాక్ ఉన్న ఇసుకను టీడీపీ కూటమి నేతలు జూన్ 4 నుంచి పది రోజుల వ్యవధిలో విక్రయించినట్లు సమాచారం. అలాగే సూళ్లూరుపేట మావిళ్లపాడు పాయింట్ వద్ద 1900 మెట్రిక్ టన్నులు, సత్యవేడుకు చెందిన సుబ్బానాయుడు, అడవికొడియంబేడు వద్ద 2900 మెట్రిక్ టన్నులు, వెంకటగిరి మొగళ్లగుంట 1200 టన్నులకు పైగా టీడీపీ నేతలు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ప్రచారంలోకి వచ్చింది.

వెంకటగిరిలో నో స్టాక్

జిల్లాలో నాలుగు ఇసుక స్టాక్ పాయింట్లు పెట్టారు. తొలిరోజు ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదంటూ ఇసుక పంపిణీకి బ్రేక్ పడింది. రెండవ, మూడవ రోజు వెంకటగిరి మండలంలోని మొగళ్లగుంట స్టాక్ పాయింట్‌లో ఇసుక లేకపోవడంతో అక్కడికి వెళ్లినవారు ఉస్సూరంటూ వెనుదిరిగారు. ఇసుక కోసం అద్దె ట్రాక్టర్లతో వచ్చిన తమకు చివరకు తమ జేబులకు చిల్లు పడిందని పలువురు మండిపడ్డారు.

టీడీపీ నేతల టిప్పర్లకే తొలి ప్రాధాన్యత!

ఇసుకను పారదర్శకంగా పంపిణీ చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు ఆర్భాటంగా ప్రకటించినా వాస్తవం మరోలా ఉంటోంది. తొలుత టీడీపీ నేతలకు చెందిన టిప్పర్లకు ఇసుక లోడ్ చేసిన తర్వాతే ట్రాక్టర్లకు ఇసుక ఇవ్వాలని పంపిణీదారులకు నేతలు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకు లెక్కలు చూస్తే 70శాతం టిప్పర్లకే ఇచ్చారు. మిగిలిన 30శాతం మాత్రమే ట్రాక్టర్లకు ఇచ్చారు. ఆ ట్రాక్టర్లు కూడా టీడీపీ వాళ్లవే! దీంతో సామాన్యులు ట్రాక్టర్ ఇసుక తెచ్చుకోవడానికి ఉదయం వెళితే 12 గంటల పాటు పడిగాపులు కాయాల్సి వస్తోంది.

ట్రాక్టర్ ఇసుక కోసం రోజంతా పడిగాపులు



ట్రాక్టర్ ఇసుక కోసం పొద్దున్నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇసుక ఫ్రీ అని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. ఇప్పుడేమో టన్నుకు రూ.465 కట్టమంటున్నారు. ఈ లెక్కన 5 టన్నుల ఇసుకకు రూ. 2,325 చెల్లించాం. మరో రూ.3వేలు ట్రాక్టర్‌కు బాడుగ. రోజాంతా టైం వేస్ట్ అయ్యిందని..ఇంకా ఎక్కువ ఇవ్వాలని ట్రాక్టర్ డ్రైవర్ డిమాండ్ చేశాడు. ఇల్లు కట్టడానికి ఇసుక కొనడానికే లక్షల్లో ఖర్చు పెట్టాల్సి వస్తోంది.

-ఢిల్లీబాబు, తల్లంపాడు, దొరవారి సత్రం మండలం, సూళ్లూరుపేట నియోజకవర్గం

ట్రాక్టర్ల బాడుగల మోత



మా ఊరి నుంచి వెంకటగిరి మావిళ్లగుంట ఇసుక పాయింట్‌కు వెళ్లడానికి 100 కిలోమీటర్లు దూరం ఉంది. ట్రాక్టర్‌కు రూ.10వేలు బాడుగ అడుగుతున్నారు. ఇసుక టన్ను రూ.590 చెల్లించాలి. ఒక్క ట్రాక్టర్‌కు 5 టన్నుల ఇసుక పడుతుంది. ఒక ట్రాక్టర్ ఇసుక ఇంటికి చేరడానికి రూ.13 వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. మరోవైపు మావిళ్లగుంట వద్ద ఇసుక సక్రమంగా ఉండడం లేదు .100 కిలోమీటర్లు వెళ్లి తిరిగి ట్రాక్టర్ ఖాళీగా రావాలంటే బాడుగ మాటేంది?

-మధుశేఖర్‌రెడ్డి, కలువాయి, వెంకటగిరి నియోజకవర్గం

పడిగాపులు కాస్తున్నాం



ఒక ట్రాక్టర్ ఇసుక కోసం పొద్దున్నే వస్తే ఇక్కడ సాయంత్రం అవుతోంది. దీంతో ట్రాక్టర్ బాడుగ పెరిగిపోతుంది. రోజంతా బాడుగ ట్రాక్టర్ ఇక్కడే ఉండాలంటే ఎక్కువ అడుగుతున్నారు. ట్రాక్టర్ కన్నా టిప్పర్లకు ముందు అనుమతి ఇస్తున్నారు. దీంతో ఇంకా లేటవుతోంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. -సుకుమార్, నాగలాపురం

కిలోమీటర్ల బట్టి బాడుగ

10 కిలోమీటర్ల లోపు ఒక ట్రాక్టర్‌కు రూ.1000 బాడుగ, టిప్పర్‌కు అయితే రూ.4వేలు చెల్లించాల్సి ఉంటుంది. 50 కిలోమీటర్లకు అయితే రూ.5వేలు చెల్లించాలి. అదే టిప్పర్లు అయితే (20 టన్నులు) 10 కిలోమీటర్లకు రూ.4 వేలు చెల్లించాలి, అంటే ట్రాక్టర్ కన్నా టిప్పర్‌కు నాలుగు రెట్లు అదనంగా బాడుగా ఇవ్వాల్సి ఉంటుంది. ఉదాహరణకు వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి మండలానికి చెందిన వినియోగదారులు వెంకటగిరిలోని మొగళ్లగుంటకు ఇసుక కోసం రావాల్సి ఉంది. టన్ను ఇసుక రూ.590 ప్రభుత్వానికి కట్టాలి. ఒక ట్రాక్టర్‌కు 5 టన్నులు పడుతుంది. అంటే రూ.2950 చెల్లించాలి, కలువాయి నుంచి వెంకటగిరి 100 కిలోమీటర్లు దూరం ఉంది. 10 కిలోమీటర్లకు రూ.1000 చొప్పున 100కిలోమీటర్లకు రూ.10వేలు బాడుగ ఇవ్వాలి. మొత్తం ఒక ట్రాక్టర్ ఇసుక ఇంటికి రావడానికి రూ.13వేలు ఖర్చు అవుతోంది. అలాగే చంద్రగిరి, పాకాల మండలాల వారు ఇసుక కోసం 80 కిలోమీటర్ల పైచిలుకు దూరంలోని పిచ్చాటూరుకు వెళ్లాల్సి ఉంది. ట్రాక్టర్ ఇసుక రూ.1000 అయితే, బాడుగు 8వేలు చెల్లించాలి. ఇంటికి ఒక ట్రాక్టర్ ఇసుక చేరాలంటే రమారమి రూ.9 వేలు వ్యయం అవుతుంది.



ఇసుక లేని వెంకటగిరి మొగళ్లగుంట స్టాక్ పాయింట్



దొరవారిసత్రం మావిళ్లపాడు వద్ద ఇసుక కోసం బారులు తీరిన టిప్పర్లు



నాగలాపురంలో ఇసుక కోసం ఓచర్లు రాయించుకునేందుకు గుమిగూడిన వినియోగదారులు

మీరా.. నేనా!

- తిరుపతిలో చిత్తూరు నేతలదే పెత్తనం
- ఎమ్మెల్యే చెప్పినట్టు నడుచుకోవాల్సిందే
- పార్టీ గెలుపు కోసం కష్టపడింది మేమే
- పదవులు జనసేన వారికే కట్టబెట్టాలి
- గెలుపు కోసం తామూ పనిచేశామంటున్న టీడీపీ, బీజేపీ
- తిరుపతి కూటమిలో ఎవరి దారి వారిదే!



సాక్షి, తిరుపతి: అధికారంలోకి వచ్చి నెల కూడా గడవక ముందే కూటమిలో ఆధిపత్యపోరు తారస్థాయికి చేరింది. తమ మాటే చెల్లుబాటు కావాలని ఎవరికి వారు పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేరు చెప్పి బంధువులు, చిత్తూరుకు చెందిన వారు తిరుపతిలో పెత్తనం చెలాయిస్తుండడంపై స్థానిక కూటమి నేతలు మండిపడుతున్నారు. తిరుపతికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులా? సుగుణమ్మ, కిరణ్‌రాయలా? లేదా మిగిలిన వారా? అంటూ చిత్తూరు నుంచి నగరంలో తిష్టవేసిన వారు స్థానిక నాయకులను ప్రశ్నిస్తున్నారు. దీనికి రెండు రోజుల క్రితం క్లస్టర్ సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ మధ్య జరిగిన వాగ్యుద్ధమే నిదర్శనం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలోని నాయకులు తిరుపతి అభివృద్ధిపై దృష్టి సారించడానికి బదులు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలతో పాటు ఇంటా బయట తమ మాటే చెల్లుబాటు కావాలని ఆధిపత్యం కోసం వెంపర్లాడుతున్నారు. తానే ఎమ్మెల్యేని అంటూ ఎవరికి వారు పెత్తనం చెలాయిస్తున్నారని ఆరణి శ్రీనివాసులు వర్గీయులు చిర్రెత్తిపోతున్నారు! ఆరణి గెలుపు కోసం కష్టపడింది తాము అని, స్థానిక నాయకులను కాదని చిత్తూరు నుంచి దిగుమతి చేసుకున్న వారికి పెత్తనమివ్వడం ఏమిటని తిరుపతికి చెందిన కూటమి నేతలు కస్సుబుస్సుమంటున్నారు.

స్థానిక నాయకులంటే చులకనా?

టీడీపీ, బీజేపీ నేతల సహకారంతో గెలిచిన జనసేన అభ్యర్థి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్ని పార్టీలనూ కలుపుకుపోయేందుకు ఆసక్తి చూపడం లేదనే ప్రచారం జరుగుతోంది. కనీసం ప్రొటోకాల్ లిస్ట్ కూడా తయారు చేయకుండా, స్థానిక నాయకులెవ్వరినీ కార్యక్రమాలకు ఆహ్వానించకుండా 'నేనే' అనే ధోరణిలో ఎమ్మెల్యే ముందుకు వెళ్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గ పరిధిలోని వివిధ శాఖల అధికారుల బదిలీలు, ఉద్యోగోన్నతుల కోసం ఎమ్మెల్యేను సిఫార్సుల కోసం ఆశ్రయించడం పరిపాటి. కానీ ఎమ్మెల్యే ఆరణి ఇప్పటివరకు ఏ ఒక్క ఉద్యోగికీ సిఫార్సు లేఖ ఇవ్వకపోగా.. లేఖల కోసం చిత్తూరు నుంచి దిగుమతి చేసుకున్న వారి వద్దకు వెళ్లి కలవండి అని చెప్పి పంపడంపై స్థానిక నాయకుల్లో అసంతృప్తిని రాజేసింది.

నామినేటెడ్ పదవుల కోసం పైరవీలు

కూటమి అధికారంలోకి వచ్చి నెలరోజులు కూడా కాకముసుపే తిరుపతిలో నామినేటెడ్ పదవుల కోసం పలువురు పెద్ద ఎత్తున ప్రయత్నాలు సాగిస్తున్నారు. వాస్తవంగా పార్టీ గెలుపు కోసం కష్టపడిన వారిని సిఫార్సు చేయకపోవడంపై స్థానిక నాయకులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇక లాభం లేదని వారంతా ఎవరికి వారే పైరవీలు మొదలుపెట్టారు. తుడా చైర్మన్ , టీటీడీ పాలక మండలి సభ్యుల పదవిని ఆశిస్తున్న కిరణ్ రాయల్ వైఎస్సార్‌సీపీ నేతలను విమర్శిస్తే పదవి దక్కుతుందని ఉద్దేశంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ విమర్శలకు సంబంధించి ఎక్కడా స్థానిక ఎమ్మెల్యేకు సంబంధం లేకుండా ప్రెస్‌మీట్లు నిర్వహిస్తుండటంపై ఎమ్మెల్యే వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, కీర్తన, తదితరులు పార్టీలో తమకున్న పరపతిని ఉపయోగించుకుని పదవుల కోసం సిఫార్సులు చేయించుకుంటున్నారు. ఈ పరిణామాల క్రమంలో టీడీపీ నేతలు గ్రూపులు కట్టడంపై ఎమ్మెల్యే ఆరణి అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం . ఒకరిద్దరు నాయకులు తిరుమల కొండపై తట్టలు పెట్టించడం, టీటీడీలో రెవెన్యూ పంచాయతీలో సిఫార్సులు చేయడం, ఒకరు చంద్రబాబు వద్ద మరొకరు నారా లోకేష్ వద్ద తమకు మంచి పలుకుబడి ఉందని అధికారుల వద్ద ప్రగల్భాలు పలుకుతూ తమ సొంత పనులను చక్కదిద్దుకునే పనిలో నిమగ్నమయ్యారు.

అధినాయకులకు ఫిర్యాదుల వెల్లువ

తిరుపతి కూటమి నేతలు ఒకరిపై మరొకరు తమ పార్టీ అధినాయకులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఎమ్మెల్యేపై జనసేనలోనే కొందరు నాయకులు పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు చేస్తుంటే, తానూ తక్కువేమీ కాదని స్థానిక జనసేన నాయకులపైనా ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల తిరుపతి కార్పొరేషన్‌లో ఎమ్మెల్యేకు బదులు ఆయన అన్న కుమారుడు అధికారిక సమావేశంలో పాల్గొనడం, రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి అధికారిక కార్యక్రమంలోనూ జనసేన నాయకులు పలువురు హాజరై దిశానిర్దేశం చేయటంపై విమర్శలు వెల్లువెత్తాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని రెండ్రోజుల క్రితం జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ ఎమ్మెల్యే గురించి వ్యాఖ్యలు చేశారు. దీనికి ప్రతిగా ఎమ్మెల్యే ఆరణి కూడా కౌంటర్ ఇవ్వడంతో తిరుపతి కూటమిలో విభేదాలు బట్టబయలయ్యాయి. ఎన్నికల ముందు నుంచి ఉన్న విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి.

'పింక్ బస్' సేవలు సద్వినియోగం చేసుకోండి

- వైద్యులతో కలెక్టర్ సమీక్ష

తిరుపతి అర్బన్: పింక్ బస్ క్యాంపుల్లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం పింక్ బస్ వైద్యులతో ఆయన సమీక్షించారు. తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ (బయో) ద్వారా జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా చేస్తున్నట్టు చెప్పారు. పంచాయతీల్లో ఎంఎల్‌హెచ్‌పీలు తొలుత నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, పేగు (కోలన్) క్యాన్సర్‌కు నిర్ణీత నియమావళి ప్రకారం సర్వే చేసి మహిళలను, పురుషులను పింక్ బస్సు క్యాంపుల వద్దకు తీసుకురావాలని ఆదేశించారు. పీహెచ్‌సీ పరిధిలో మెడికలాఫీసర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, స్విమ్స్ బయో ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.జయచంద్రారెడ్డి, స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.లలిత్, మెడికలాఫీసర్ డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

కన్నావరం సచివాలయంపై ఏసీబీ దాడులు

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ విలేజ్ సర్వేయర్


లంచం తీసుకుంటూ పట్టుబడ్డ పి.గణేష్

సత్యవేడు: మండలంలోని కన్నావరం సచివాలయం సర్వేయర్ పనిచేస్తున్న పి.గణేష్ రూ.4వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కన్నావరం గ్రామానికి చెందిన భాస్కర్ పొలంలో ఎఫ్ఎంబీ సబ్ డివిజన్ చేసుకునేందుకు సర్వేయర్‌ను కోరారు. రూ.6వేలు ఇస్తే పనిపూర్తి చేస్తానని సర్వేయర్ తెలిపాడు. దీంతో భాస్కర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సలహా మేరకు తొలుత రెండు వేలు ఫోన్‌పే చేశారు. మిగిలిన నాలుగు వేల రూపాయల నగదు బుధవారం నేరుగా అందజేశారు. బుధవారం తిరుపతి ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, ఇన్‌స్పెక్టర్లు ఈశ్వర్, సూర్యనారాయణ, సునిల్, వెంకట్‌నాయుడు సచివాలయం సమీపంలో వేచి ఉండి లంచం తీసుకున్న సర్వేయర్‌ను అరెస్టు చేశారు. నగదుపై వేలిముద్రలు సేకరించి కేసు నమోదు చేశారు.

రైల్వే లైన్లకు భూసేకరణ వేగవంతం

- ఆర్డీఓలకు కలెక్టర్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆర్డీఓలను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన బుధవారం జేసీ ధ్యాన్‌చంద్రతో కలసి ఆర్డీఓలకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రైల్వేలైన్లకు అవసరమైన భూసేకరణ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ప్రధానంగా రేణిగుంట బైపాస్ వద్ద పెండింగ్‌లోని రైల్వే లైన్(తూకివాకం జంక్షన్ వద్ద), గూడూరు డివిజన్‌లోని నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు భూసేకరణ, వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, ఇనగలూరు అపాచీ అంతర్గత పనులకు భూములు, ఏపీఐఐసీకి చెందిన అంశాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, తిరుపతి, గూడూరు, శ్రీకాళహస్తి ఆర్డీఓలు నిషాంత్ రెడ్డి, కిరణ్ కుమార్, రవి శంకర్ రెడ్డి, ఏపీఐఐసీ అధికారులు నరసింహులు, చంద్రశేఖర్, విజయ రత్నం, కలెక్టరేట్ అధికారులు, సంబంధిత తహసీల్దార్లు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను ముందుకు తీసుకుపోదాం

తిరుపతి అర్బన్: విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది ముందుకు తీసుకుపోవడంలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ఆయన బుధవారం విద్యా విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడిబయట పిల్లలు అంతా బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ వి.శేఖర్‌కు సూచించారు. వారికి అందాల్సిన పుస్తకాలు, బ్యాగ్‌లు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని చెప్పారు. మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. మరోవైపు కళాశాలల అభివృద్ధికి కృషి చేయాల్సి ఉందని ఆర్ఐఓ ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి విశ్వనాథ నాయక్, సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా 187 జూనియర్ కళాశాలలను తరచూ తనిఖీలు చేస్తూ సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. జిల్లాలోని 34 భవిత కేంద్రాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. వచ్చే సమావేశంలో సాధించిన ప్రగతి తెలియజేయాన్నారు.

స్కౌట్స్ విద్యార్థులకు 'రాజ్య పురస్కార్' అవార్డులు


కలెక్టర్ నుంచి పురస్కారాలు అందుకుంటున్న స్కౌట్స్ విద్యార్థులు

తిరుపతి అర్బన్: బాల్యం నుంచే విద్యార్థులు సేవాగుణాలతో ముందుకెళ్తే సమాజానికి ఉత్తమ పౌరులవుతారని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆకాంక్షించారు. బుధవారం కలెక్టరేట్‌లో స్కౌట్స్ విద్యార్థులకు ఈ ఏడాది రాజ్య పురస్కార్ అవార్డులను ప్రదానం చేశారు. శ్రీకాళహస్తిలోని బాబు అగ్రహారం మునిసిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.శ్రీనివాసులు, వినోద్, యశ్వంత్, మురళి, లోకేష్ కలెక్టర్ నుంచి ఈ అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ వి.శేఖర్, స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, జిల్లా స్కౌట్స్ కమిషనర్ వంశీరాజా, జిల్లా కార్యదర్శి ఎం.జయరాం, కార్యాలయ కమిషనర్ టి. రమేష్ బాబు, రాష్ట్ర సహాయ కార్యనిర్వాహక కమిషనర్ కోటేశ్వరరావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ డీటీసీ వెంకటేశ్వర్లు, సావిత్రి, డీఓసీ వెంకటేశ్వర్లు, సతి సావిత్రి, సహాయ కమిషనర్ పార్వతి, యూత్ చైర్మన్ అజారుద్దీన్, స్కౌట్స్ మాస్టర్లు యోగనందం, సుబ్రహ్మణ్యం, ధనుష్ పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.74,980
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,734
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.94,400
రిటైల్ వెండి గ్రాము	రూ.96.40

సమర్థవంతంగా గస్తీ

పోలీస్ స్టేషన్ తనిఖీలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశం

చంద్రగిరి (తిరుచానూరు): రాత్రిపూట సమర్థవంతంగా గస్తీ నిర్వహించాలని, గంజాయి, సంఘ విద్రోహ శక్తుల కార్యకలాపాలపై గట్టి నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. బుధవారం ఆయన తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్త చట్టాల రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పైవిధంగా ఆదేశిస్తూ మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా కట్టడి చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి వార్నింగ్ సిగ్నల్ వ్యవస్థ, సూచిక బోర్డులు, స్టాపర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మసలుకోవాలని, అందిన ఫిర్యాదులపై జాప్యం చేయకుండా విచారణ చేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజారులో ప్రత్యేక విక్రయ కేంద్రాలు

నేటి నుంచి తగ్గింపు ధరలకు సరుకులు

తిరుపతి అర్బన్: నిత్యావసర వస్తువుల ధరలు నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో పేదలు, సామాన్యులను దృష్టిలో ఉంచుకుని ధరలు తగ్గించి సరుకులు ఇవ్వడానికి తిరుపతి, గూడూరులోని రైతు బజారు కేంద్రాల్లో ప్రత్యేక నిత్యావసర సరుకుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సివిల్ సప్లై జిల్లా అధికారి రాజారఘువీర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి ఆ కేంద్రాల్లో బియ్యం కేజీ రూ.48, స్టీమ్ బియ్యం రూ. 49కి, కందిపప్పు కిలో రూ.160 చొప్పున విక్రయిస్తారని తెలియజేశారు. జిల్లాలో మిగిలిన అసెంబ్లీ కేంద్రాల్లో హోల్‌సేల్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ నేతృత్వంలో తక్కువ ధరలకు సరుకులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

నేడు ఎస్వీయూలో నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నికలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ నాన్‌టీచింగ్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం వర్సిటీ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి షఫీ ఒక ప్రకటనలో తెలిపారు. 32 మంది సభ్యులకు గాను ఇప్పటికే 17మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలియజేశారు. అధ్యక్ష పదవి, కార్యదర్శి పదవికి ముగ్గురేసి చొప్పున, మరో 9 విభాగాలకు సంబంధించి 33 మంది బరిలో ఉన్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు జరగనున్న ఎన్నికలలో సుమారు 464మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు కౌంటింగ్ ప్రారంభించి సాయంత్రానికి ఎన్నికల ఫలితాలు వెల్లడించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆరంభం.. సాక్షాత్కార వైభవం


వాహన సేవలో పాల్గొన్న ఆలయ అధికారులు, భక్తులు


వాహన సేవ ముందు కళాకారుల ప్రదర్శన

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాల్లో భాగంగా వేకువజామునే సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిపించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. రెండో రోజు గురువారం హనుమంత వాహనంపై, మూడో రోజు శుక్రవారం గరుడ వాహనంపై స్వామివారు ఊరేగనున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.

సేవా కేంద్రాలుగా సహకార సంఘాలు


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

తిరుపతి అర్బన్: ప్రజాసేవా కేంద్రాలుగా సహకార సంఘాలు మారాల్సి ఉందని జిల్లా సహకార అధికారిణి ఎస్.లక్ష్మి పేర్కొన్నారు. బుధవారం సంస్కృత వర్సిటీలో సంఘం బలోపేతం చేయడంపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంఘాలను బలోపేతానికి సమష్టిగా కృషిచేయాల్సి ఉందని చెప్పారు. జిల్లా సహకార అధికారి కార్యాలయ సూపరింటెండెంట్ మద్దిపట్ల వెంకటరమణ, శివశంకర్ నాయక్, సతీష్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పైన వంకాయలు.. కింద ఎర్ర చందనం!

- ట్రక్ ఆటోలో 27 దుంగలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



తడ : పైన వంకాల లోడు.. కింద ఎర్ర చందనం దుంగలతో చెన్నై వెళుతున్న ట్రక్ ఆటోను తడ పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన కత్తి వెంకటసుబ్బయ్యకు చెందిన ట్రక్ ఆటోను చెన్నైకి వంకాయలు తరలించేందుకు ఓ వ్యక్తి కిరాయి మాట్లాడుకున్నాడు. చెన్నైలో ఫలానా చోటుకి వెళితే అక్కడ మరో వ్యక్తి వచ్చి సరుకు తీసుకుని డబ్బులు ఇస్తాడని చెప్పి 30 వేలు కిరాయి చేతిలో పెట్టాడు. దీంతో ఆటోని తీసుకుని బయలు దేరిన సుబ్బయ్య చెన్నై వెళ్లాక అక్కడ ఎవరూ తారసపడకపోవడంతో ఆటోతో సహా తిరిగి స్వస్థలానికి బయలుదేరాడు. ఆటో బీవీపాళెం చెక్‌పోస్టు వద్దకు వచ్చే సరికి చెన్నై నుంచి ఫోన్ రావడంతో మళ్లీ చెన్నై వెళ్లే ప్రయత్నం చేస్తుండగా.. సూళ్లూరుపేట సీఐ మధుబాబుకి అందిన సమాచారంతో తడ ఎస్ఐ నరసింహారావుకు సమాచారం ఇవ్వడంతో దాడి చేసి ఆటోను పట్టుకున్నారు. తెల్ల వంకాయల బస్తాల కింద 27 ఎర్ర చందనం దుంగలున్నట్టు గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చెన్నైలో నిఘా ఎక్కువగా ఉండడంతో స్మగ్లర్లు అప్రమత్తమై ఆటో డ్రైవర్‌కు తమ స్థావరం వివరాలు చెప్పకుండా దాచి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఎట్టకేలకు కదిలారు!

- మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు
- నీటి నమూనాల సేకరణ


మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో తనిఖీలు చేస్తున్న జిల్లా ఫుడ్ కంట్రోలర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురంలోని పాస్-మనోవికాస్ మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో డయేరియా బారిన పడి ఇద్దరు మృతి చెందడం కలకలం రేపింది. జిల్లా కలెక్టర్, వైద్య, ఆరోగ్య, రెవెన్యూ అధికారులు...ఇలా జిల్లా యంత్రాంగం మొత్తం కదిలింది. డయేరియా విస్తరించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. దీంతో ప్రమాద తీవ్రత పెరగకుండా కట్టడి చేయగలిగారు. అయితే కీలకమైన ఫుడ్ కంట్రోలర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ కన్నెర్ర చేశారు. దీంతో బుధవారం జిల్లా ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ యద్దులేటి, నర్మద, జగదీష్ తీరిగ్గా ఆశ్రమంలో తనిఖీలు చేశారు. నీటి నమూనాలు సేకరించారు. సమగ్ర విశ్లేషణ కోసం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించినట్లు జిల్లా ఫుడ్ కంట్రోలర్ తెలిపారు. పూర్తి స్థాయి నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు

తిరుపతి రైల్వే స్టేషన్లో తనిఖీలు

12 మందిపై కేసులు


అనధికార హాకర్లను అదుపులోకి తీసుకున్న రైల్వే అధికారులు, ఆర్‌పీఎఫ్‌లు

తిరుపతి (అలిపిరి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో మంగళవారం రాత్రి రైల్వే అధికారులతో పాటు ఆర్పీఎఫ్‌లు తనిఖీలు నిర్వహించారు. 12 మంది అనధికార హాకర్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.12 వేలు జరిమానా వసూలు చేయడంతో పాటు వారిపై 144 సెక్షన్ కింద కేసులు నమోదు చేశారు. బుధవారం రాత్రి తనిఖీ చేశారు. కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, క్యాటరింగ్ ఇన్‌స్పెక్టర్, టికెట్ తనిఖీ సిబ్బంది, ఆర్‌పీఎఫ్‌లు పాల్గొన్నారు.

ఎద్దు పొడిచి యజమాని మృతి

బైరెడ్డిపల్లె: తాను పెంచిన ఎద్దు చేతిలోనే యజమాని మృతి చెందిన విషాద సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికల కథనం మేరకు, సాధారణంగా మేలేరు పండుగలో వదిలిపెట్టే ఎద్దులతో ఎలాంటి వ్యవసాయ పనులు చేయించరు. మండల కేంద్రానికి చెందిన జయచంద్ర (37) కొంత కాలంగా మైలేరు ఎద్దును మేపుతూ మైలేరు పోటీలకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం తన పొలం వద్ద ఆ ఎద్దును మేపుతుండగా జయచంద్రపైనే తిరగబడి ఆ ఎద్దు పొడిచింది. స్థానిక రైతులు బైరెడ్డిపల్లె పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు డాక్టరు నిర్ధారించారు.

రుచికరంగా అన్నప్రసాదాలు

తిరుమల: దేశ విదేశాల నుంచి ప్రతి రోజు శ్రీవారి దర్శనానికి విచ్చేసి వేలాది మంది భక్తులకు నాణ్యంగా, రుచికరంగా అన్న ప్రసాదాలు అందిస్తున్నట్లు టీటీడీ ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని జేఈఓ వీరబ్రహ్మంతో కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈఓ మీడియాతో మాట్లాడుతూ, తిరుమలలో ప్రతిరోజు 2 లక్షల మందికి అన్నప్రసాదాలు అందిస్తున్నామన్నారు. భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన అన్న ప్రసాదం అందించేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగా అన్నప్రసాద భవనంలో 10-15 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఆహార తయారీ యంత్రాలను మార్చి కొత్తవి అందుబాటులోకి తీసురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. అన్నప్రసాద విభాగంలో పనిచేస్తున్న సిబ్బందిని పెంచనున్నట్లు తెలిపారు. ఇందుకోసం దేశంలోని ప్రముఖ చెఫ్‌లు, క్యాటరింగ్ నిపుణులతో ఏర్పాటు చేసిన కమిటీ సమగ్ర నివేదిక సమర్పించిందన్నారు. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోనున్నట్లు ఈఓ వివరించారు. అన్నప్రసాద విభాగంలో టీటీడీ ఉద్యోగులు చక్కగా సేవలందిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

దోపిడీ కేసును చిత్తూరు కోర్టుకు పంపిన జడ్జి

నిందితులకు శిక్ష విధించిన కోర్టు


తిరుపతి నాలుగవ అదనపు జూనియర్ జడ్జి గ్రంధి శ్రీనివాస్

తిరుపతి లీగల్ : తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దోపిడీ కేసు తీవ్ర నేరమైనదిగా భావించి తిరుపతి 4వ అదనపు జూనియర్ జడ్జి గ్రంధి శ్రీనివాస్, చిత్తూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఈ ఏడాది మార్చి 27న పంపినట్టు తిరుపతి 4వ అదనపు జూనియర్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి బుధవారం మీడియాకు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.... తమిళనాడుకు చెందిన తంగం రాజా, దొరైస్వామి తిరుపతి, ఖాజా మొహిద్దీన్ గత ఏడాది అక్టోబర్ 11వ తేదీ రాత్రి 10:30 గంటల ప్రాంతంలో అలిపిరి బస్టాండ్ సమీపంలో తిరుపతి మంగళం చెందిన పి అనిష్‌పై మారణాయుధాలతో దాడి చేసి అతని వద్ద ఉన్న సొమ్ము, వస్తువులను దోచుకెళ్లారు. అప్పట్లో బాధితుడి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి గ్రంధి శ్రీనివాస్ మొత్తం కేసును విచారణ చేశారు. వారు తీవ్రమైన నేరానికి పాల్పడ్డారని, జూనియర్ జడ్జి కోర్టు విధించే శిక్షా కాలం కంటే వారికి ఎక్కువ శిక్ష విధించాల్సి ఉందని భావించారు. దీంతో కేసును చిత్తూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు విచారణ నిమిత్తం బదిలీ చేస్తూ తీర్పు చెప్పారు. దీంతో చిత్తూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎఫ్ఏసీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేసు పూర్వాపరాలను మరోసారి పరిశీలించి నిందితులకు ఐదు సంవత్సరాల ఆరునెలలు జైలు శిక్ష విధించడంతోపాటు ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్టు ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మృతురాలు ఒడిశా వాసి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న తిరుపతి డీఎస్పీ రవి మనోహర్ ఆచారి

తిరుపతి క్రైమ్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. తిరుపతి డీఎస్పీ రవి మనోహరాచారి తెలిపిన వివరాలు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన బాబురావు బతుకుదెరువు కోసం భార్యాపిల్లలతో ఏడాది క్రితం తిరుపతిలోని రాజీవ్ గాంధీ కాలనీకి నివాసం వచ్చాడు. ఇదే క్రమంలో ఒడిశాకు చెందిన మిత్‌సబర్(26)తో పరిచయమైంది. ఆమెకు భర్త దూరంగా ఉండడంతో బాబురావుతో సన్నిహితంగా ఉండేది. అందరూ కలిసి రాజీవ్‌గాంధీ కాలనీలో నివాసం ఉండేవారు. అయితే కొన్నిరోజుల క్రితం ఆమెను మాధవనగర్‌లో కాపురం మార్చాడు. వీరి వద్ద మనస్పర్థలు తలెత్తాయి. ఆదివారం మద్యం సేవించి ఇంట్లో నిద్రపోయారు. ఉదయం లేచేసరికి ఆమె ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందింది. నిద్రలేచి చూసిన బాబురావు భయపడిపోయాడు. కేసు తన మీదకు వస్తుందనే ఉద్దేశంతో మృతదేహాన్ని మంగళం రోడ్‌లోని ఒక ప్రైవేటు హాస్పిటల్ సమీపంలో ముళ్లపొదల్లో సోమవారం ఉదయం పడేసాడు. అయితే బుధవారం ఉదయం తన యాజమానికి జరిగిన విషయాన్ని తెలియజేశాడు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే ఆమె ఉరి వేసుకుని మరణించిందా? బాబూరావే హత్య చేశాడా? అనేది పోస్టుమార్టం రిపోర్టులో తేలాల్సి ఉందని డీఎస్పీ చెప్పారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా సంహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి


ఎంఆర్‌పల్లిలోని భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

తిరుపతి రూరల్: దివ్యాంగ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి ముత్యాలరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. చిన్నారులకు అందిస్తున్న ఫిజియోథెరపీ విధానాలను పరిశీలించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. భవిత కేంద్రాల్లో అందిస్తున్న ఫిజియోథెరపీ సేవల వల్ల తమ పిల్లల శారీరక అవయవాల్లో పురోగతి కనిపిస్తోందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఫిజియోథెరపిస్టు సరళకుమారి, సంహిత ఉపాధ్యాయురాలు ఉషారాణిని చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. సీఆర్ఎంటీలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.